

కార్మికులకు దుస్తులు, సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, పాలనాధికారి శ్యామ్‌ప్రసాద్, ఉప కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్

స్వచ్ఛ భారత్ సాధిద్దాం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: జాతిపిత గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో అన్ని వర్గాలు స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని జిల్లా పాలనాధికారి ఏ.శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే బి.విజయచంద్ర, ఉప కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ కోరారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్ఎన్ఎంనగర్ ఉద్యానవనంలో ప్రజలతో కలసి శ్రమదానం చేశారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, పరికరాలు పంపిణీ చేశారు. పుర అధ్యక్షురాలు బి.గౌరీశ్వరి, పుర కమిషనరు కె.శ్రీనివాస్, ఎన్‌జీవో నాయకుడు జి.కిశోర్ పాల్గొన్నారు.



పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: కోర్కెలు తీర్చే కల్పవల్లి.. భక్తుల నుంచి నీరాజనాలు అందుకుంటున్న పాలకొండ కోటదుర్గమ్మ శరన్నవ రాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. గురువారం నుంచి పది రోజుల పాటు జరగనుండటంతో పట్టణం పండగ శోభను సంతరించుకుంది.

తల్లి నిజరూపం.. నేడు దర్శన భాగ్యం

పది రోజులు దసరా ఉత్సవాలు



విద్యుత్తు దీపాల వెలుగుల్లో ప్రధాన ఆలయం

ఏడాదికోమారు భక్తులకు లభించే కోటదుర్గమ్మ నిజరూప దర్శనం గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలగనుంది. ఎనిమిది చేతులతో కనిపించే అమ్మవారిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. తొలిపూజలో ఎమ్మెల్యే జయకృష్ణ పాల్గొంటారు. ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం బేరి కుటుంబ సభ్యులు ముహూర్తపు రాటను వేసిన అనంతరం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

రోజుకో ప్రత్యేకత

నిత్యం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. 3న బాలాత్రిపురసుందరీదేవికి పంచామృతాలతో, 4న గాయత్రీమాతకు పండ్ల రసాలతో, 5న అన్నపూర్ణాదేవికి విభూదితో, 6న లలితాత్రిపురసుందరికి పుష్పాలతో, 7న మహాచండీదేవికి తేనెతో అభిషేకం చేస్తారు. 8న మహాలక్ష్మీదేవిని గాజులతో, 9న మహా సరస్వతీదేవిని పెన్నులు, పుస్తకాలతో, 10న దుర్గాదేవిని పసుపుకొమ్ములతో, 11న మహిషాసురమర్దినిదేవిని ఎండు ద్రాక్షతో, 12న రాజరాజేశ్వరిదేవిని సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయనున్నారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

పరిశ్రమ పెట్టరు.. స్థలం ఇవ్వరు

★ రద్దు చేద్దామంటే సాంకేతిక సమస్య

పరిశ్రమ కోసం స్థలాన్ని తీసుకొని ఏడాది లోపు యూనిట్ ఏర్పాటు చేయకుంటే సంబంధిత యజమానికి ముందుగా నోటీసు ఇచ్చి రద్దు చేసేవారు. ఆ స్థలాన్ని కొత్తగా వచ్చే ఔత్సాహికులకు కేటాయించేవారు. కానీ.. తాజా నిబంధనలు గుదిబండగా మారాయి. రద్దు చేయాలంటే యజమాని ఆమోదం తప్పనిసరి చేయడంతో ఏపీఐఐసీకి ఇబ్బందికరంగా మారింది. కనీసం నోటీసులు ఇస్తే తీసుకోని వారు రద్దు చేస్తామంటే ఎలా ముందుకు వస్తారన్నది ప్రశ్నగా మారింది. మరోవైపు యూనిట్ల యజమానుల బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. ఈ ప్రభావం పారిశ్రామికవాడ అభివృద్ధిపై పడుతోంది.

– న్యూస్‌టుడే, బొబ్బిలి

బొబ్బిలి పారిశ్రామికవాడలో ఐదేళ్ల కిందట స్థలాలు తీసుకుని పరిశ్రమలు పెట్టని 20 మంది యజమానులను ఆరు నెలల కిందట ఏపీఐఐసీ గుర్తించింది. వారికి నోటీసులు కూడా ఇచ్చారు. వివరణ రాకపోవడంతో రద్దు చేసి స్థలాలను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్తే సాంకేతిక సమస్య రావడంతో అధికారులు మిన్నకుండిపోయారు. స్థల యజమాని సంతకాలు ఉండాలి అనడంతో వారికి సమాచారం ఇచ్చినా రాకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. వాటిని రద్దు చేస్తే సుమారు 30 ఎకరాలు అందుబాటులోకి వస్తుంది. ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలోనూ ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై పునరాలోచన చేస్తే తప్ప రద్దుకు అవకాశం లేదు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్‌విండో విధానంలో అనుమతులు జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి.

★ ఆస్తి పన్ను బకాయిలు రూ.8.50 కోట్లు
★ నీటి రుసుము రూ.3 కోట్లు
★ ఇతర పన్నులు రూ.1.50 కోట్లు

రూ.కోట్లలో బకాయిలు

పరిశ్రమలు ఏర్పాటు చేయడమే కాదు యజమానులు ఖాళీ స్థలాల పన్ను కూడా చెల్లించడం లేదు. మూతపడ్డ యూనిట్ల నుంచి కూడా ఆస్తి పన్ను వసూలు కావడం లేదు. పరిశ్రమలకు ఇచ్చిన నీటి సరఫరా రుసుములు రావడంలేదు. సుమారు రూ.13 కోట్ల పైచిలుకు బకాయిలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నారు. నోటీసులు ఇస్తున్నా స్పందన లేదన్నారు. దీనివల్ల అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామని అంటున్నారు.

నిధుల జాడలేదు

పారిశ్రామికవాడ అభివృద్ధికి గత ఐదేళ్లలో నిధులు రాలేదు. రహదారులు పాడయ్యాయి. విద్యుద్దీకరణ పరికరాలు మూలకు చేరాయి. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపినా పైసా విదల్చలేదు. ఇదిగో అదిగో అంటూ గత ప్రభుత్వం కాలయాపన చేసింది. ఇటీవల వర్షాలకు రహదారులపై భారీ గుంతలు పడి వాహనాలు కూరుకుపోతున్నాయి.



రద్దు చేసేందుకు గుర్తించిన స్థలాల్లో ఇదొకటి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

స్థలాల రద్దుకు ఇబ్బందులు రావడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. స్పష్టత వచ్చాక రద్దు చేస్తాం. యూనిట్ల ఏర్పాటుకు ఎవరు ముందుకు వచ్చినా నిబంధనల మేరకు వెంటనే కేటాయిస్తాం. బకాయిల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపాం.

– మురళీమోహన్, జోనల్ ప్రబంధకుడు, ఏపీఐఐసీ



పెదమరికికి గజరాజులు

కొమరాడ, న్యూస్‌టుడే: నిన్నటి వరకు ఒడిశా భూభాగంలో సంచరించిన ఏనుగుల గుంపు డంగభద్ర, నందాపురం మీదుగా పార్వతీపురం మండలం పెదమరికి సమీపంలోకి చేరుకుంది. వరితో పాటు పత్తి పూత దశకు వచ్చిందని, ఈ సమయంలో ఏనుగులు నష్టపరిస్తే.. ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని రైతులు భయపడుతున్నారు. ఇక్కడి నుంచి తరిమికొట్టాలని కోరుతున్నారు.



సీపీఎస్ రద్దే లక్ష్యం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో గాదె శ్రీనివాసులనాయుడును గెలిపిస్తే సీపీఎస్ రద్దు, ఏకీకృత సేవా నిబంధనల సాధన లక్ష్యంగా పనిచేస్తారని పీఆర్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ అన్నారు. బుధవారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద పీఆర్టీయూ ప్రాంతీయ సమావేశం జిల్లాశాఖ సహాధ్యక్షుడు బి.రవికుమార్ అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి కె.విజయ్ ఆధ్వర్యంలో జరిగింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపిస్తే ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తారని చెప్పారు.

అక్రమ రవాణా నివారించాలి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సబ్ డివిజన్ పరిధిలో గంజాయి, సారా అక్రమ రవాణాపై ప్రత్యేక శ్రద్ధ చూపి నివారించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన సబ్-డివిజనల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న కేసులు, ఎస్టీ, ఎస్సీ కేసుల దర్యాప్తు ఏ విధంగా జరుగుతుందో ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల ఛేదనలో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఎస్పీ అంకిత సురాన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

నేటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలు

★ రాయనున్న 22,889 మంది అభ్యర్థులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్‌లో 21 వరకు జరగనున్నాయి. 22,979 మంది అభ్యర్థులు రాయనున్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి 12, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ ఇన్‌ఛార్జిగా, ఆర్డీవో దాట్ల కీర్తి పర్యవేక్షణాధికారిణిగా వ్యవహరించనున్నారు. ఉప తహసీల్దార్లను డిపార్ట్‌మెంటు అధికారులుగా, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లుగా ఇద్దరు ప్రత్యేక ఉప కలెక్టర్లను నియమించినట్లు డీఈవో ప్రేమకుమార్ తెలిపారు. కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తుతో పాటు విద్యుత్తు, రవాణా, వైద్య సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా..

★ అభ్యర్థులు పరీక్ష సమయానికి 30 నిమిషాలు ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.
★ నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు.
★ హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ ఐడీ తప్పనిసరి.
★ వీహెచ్, పీహెచ్ అభ్యర్థులకు 50 నిమిషాలు అదనంగా సమయం కేటాయిస్తారు.
★ ఎలక్ట్రానిక్ పరికరాలతో రావడం నిషేధం.

సహాయక కేంద్రం: అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం డీఈవో కార్యాలయంలో సహాయక కేంద్రాన్ని (హెల్ప్‌డెస్క్) ఏర్పాటు చేశారు. 98497 39920, 94933 13271, 94409 41627 నంబర్లలో సంప్రదించవచ్చు.



లెండి ఇంజినీరింగ్ కళాశాల

ఏ కేంద్రంలో ఎంత మంది

ఎక్కడ	అభ్యర్థుల సంఖ్య
స్వామి వివేకానంద ఇంజినీరింగ్ కళాశాల (కలవరాయి, బొబ్బిలి మండలం)	1800
ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, చింతలవలస	4,231
సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గాజులరేగ	3,216
అయాన్ డిజిటల్ జోన్ (గాజులరేగ)	12,852
లెండి ఇంజినీరింగ్ కళాశాల, జొన్నాడ	880

గృహయోగం

ఎన్టీఆర్ స్మార్ట్ సిటీలకు స్థలాన్వేషణ

అల్పాదాయ వర్గాలకు కారు చౌకగా ఇంటి స్థలాలు అందిస్తాం.. ప్రైవేటు లేఅవుట్లకు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. గత ప్రభుత్వం మాట.

– ఐదేళ్లలో జగనన్న స్మార్ట్ సిటీల్లో మోక్షం కల్పించలేదు.

న్యూస్‌టుడే, బొబ్బిలి

కూటమి ప్రభుత్వం 'ఎన్టీఆర్ స్మార్ట్ సిటీలు'గా నామకరణం చేసి.. స్థలం ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా బొబ్బిలి పట్టణ అభివృద్ధి అథారిటీ (బుడా) పరిధిలోని పార్వతీపురం మన్యం, సాలూరు, బొబ్బిలి పురపాలక సంఘాల్లో కొత్తగా స్థల సేకరణ అన్వేషణలో అధికారులు పడ్డారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు లేదా రైతుల నుంచి కొనుగోలు చేయనున్నారు.

ఇక్కడ కొత్తగా సేకరణ: పార్వతీపురంలో గతంలో అడ్డాపుశిల వద్ద 30 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. అక్కడ లేఅవుట్ వేస్తే కొనుగోలుదారులు ముందుకు రారని బుడా అభ్యంతరం తెలపడంతో ఇప్పుడు దగ్గరలో సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు.



బొబ్బిలిలో గతంలో పరిశీలించిన స్థలం

అందరికీ ఒకే దఫా లాటరీ: జాతీయ రహదారి పక్కనే సాలూరులో సుమారు పదెకరాల్లో లేఅవుటు వేశారు. కేవలం 19 మంది ముందుకు రాగా లాటరీలో స్థలాలు కేటాయించారు. 20 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా వస్తే లాటరీలో కేటాయించాలని అధికారులు భావిస్తున్నారు. ఇక్కడ తొలుత నిర్వహించిన సర్వేలో 1,500 మంది స్థలాల కోసం ముందుకొచ్చారు. లేఅవుట్ వేశాక వెనుకంజ వేశారు. మౌలిక సదుపాయాలు కల్పించలేదు.

ఆది నుంచి జాప్యమే: బొబ్బిలిలో రామన్నదొరవలస వద్ద 20 ఎకరాల డీపట్టా భూములను గుర్తించారు. వాటి రైతులకు పరిహారం ఇవ్వకుండా ఎకరాకు 625 గజాల స్థలం అభివృద్ధి చేసి ఇవ్వాలని నిర్ణయించినా.. కొలిక్కి రాలేదు. పారిశ్రామికవాడ సమీపంలో 30 ఎకరాలు పరిశీలించినా.. దారి సమస్యతో ఊరుకున్నారు. రామభద్రపురం, కురుపాంలోనూ లేఅవుట్లు వేయాలని బుడా అధికారులు ప్రతిపాదించినా స్థల సేకరణ జరగలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థలాలు చూస్తున్నామని బుడా పీవో డీవీ దేవకుమార్ తెలిపారు.

సక్షం.. మదిలో అక్షరం


మొక్కలతో ఆహ్లాదకరంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ

అంగన్‌వాడీకి వెళ్లాలంటే కొందరు పిల్లలు మారం చేస్తారు.. బుజ్జగిస్తే తప్ప ఇళ్ల నుంచి కదిలే పరిస్థితి ఉండదు.. గర్భిణులు, బాలింతలు సైతం కేంద్రాల వద్ద ఉండేందుకు ఇష్టపడరు.. కానీ ఆ గ్రామంలో మాత్రం అంగన్‌వాడీ కేంద్రమే ఓ ఉద్యానం.. అదే ఓ సినిమా థియేటర్.. సరికొత్త అనుభూతిని పంచే భవనం.. సక్షం కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేస్తూ అందరి మన్ననలూ పొందుతోంది పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పిండ్రంగివలస కేంద్రం.

ఆదర్శం ఇలా.. 'సక్షం' కేంద్ర ప్రభుత్వ పథకం. ఇటీవల కేంద్ర మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మహిళ, శిశు వికాస్ మంత్రి అన్నపూర్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే గతేడాది దేశంలో కొన్ని గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి.. మొదలు పెట్టారు. అందులో పిండ్రంగివలస ఒకటి. టీవీతో పాటు వివిధ రకాల పరికరాలను అందించారు. ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించే వారు. ఈ సదుపాయాలను కేంద్రం కార్యకర్త బంగారమ్మ సద్వినియోగం చేసుకుని మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే ఈమె 2021లో రాష్ట్రస్థాయిలో చాంఫియన్ ఆఫ్ ఐసీడీఎస్‌గా, ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా ప్రశంస దక్కించుకున్నారు.

అంతా ఇక్కడే.. పాచిపెంట మండలంలో ఇదో గిరిజన ప్రాంతం. ప్రారంభంలో చిన్నారులు వెళ్లేవారు కాదు. గర్భిణులు, బాలింతలు సైతం దూరంగా ఉండేవారు. కొన్నేళ్లుగా అక్కడే సేదదీరుతున్నారు. మొక్కలతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో ఉంటూ.. 15 మంది చిన్నారులతో సరదాగా గడుపుతుంటారు. టీవీలో బొమ్మలతో కూడిన పాఠాలు చెబుతున్నామని.. వారు ఇష్టపడే బొమ్మలు, ఆట వస్తువులను సొంతంగా తయారు చేసి బోధిస్తున్నామని బంగారమ్మ చెబుతున్నారు. స్థానికంగా పండే కూరగాయలతో పాటు పూలు, పండ్లను వారికే అందజేస్తున్నామన్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట


పండ్ల రకాల బొమ్మలు


ఎల్ఈడీ టీవీలో దృశ్యాలను తిలకిస్తున్న చిన్నారులు

బడ్జెట్ తయారీలో భాగస్వాములు కావాలి: డీఎల్‌పీవో


గ్రామసభలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగభూషణరావు

పార్వతీపురం గ్రామీణం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: పంచాయతీల పరిధిలో వార్షిక బడ్జెట్ తయారీలో అందరూ భాగస్వాములు కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణరావు కోరారు. బుధవారం మండలంలోని నర్సిపురంలో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభలో 2025-26 వార్షిక బడ్జెట్ సదస్సులో పాల్గొన్నారు. సర్పంచి బంగారమ్మ నేతృత్వంలో ఎంపీటీసీ సభ్యుడు తవిటినాయుడు, ప్రధాన పార్టీల నాయకులు, ప్రజలు సూచించిన అవసరాలను గుర్తించగా సచివాలయ కార్యదర్శులు జగన్మోహనరావు తీర్మానం ● గరుగుబిల్లి మండలంలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయడానికి సన్నాహాలు ప్రారంభించామని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరుగుబిల్లిలో ఉత్తమ వెలుగు సీఆర్‌పీ ఇజ్జరోతు గౌరీశ్వరికి గుర్తించి సర్పంచి కలిశెట్టి ఇందుమతి దుశ్శాలువాతో సన్మానించారు. ● జియ్యమ్మవలస మండలంలో ఉపాధి హామీ ఆధ్వర్యంలో బుధవారం పెదమేరంగి, చినమేరంగి, తాళ్లడుమ్మ, అల్లువాడ, అంకవరం, బీజేపురం, అర్నాడ, చింతల బెలగాం తదితర గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. 2024-25లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చర్చించారు.

గ్రంథాలయం, పఠనమందిరం ప్రారంభం


బలిజిపేట: పలగరలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న రాజు

బలిజిపేట, న్యూస్‌టుడే: పలగర గ్రామ మీసాలవీధిలో బుధవారం మధ్యాహ్నం చౌడు అప్పలస్వామినాయుడు సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని, పఠన మందిరాన్ని సీనియర్ న్యాయవాది రాజు ప్రారంభించారు. వ్యవస్థాపకుడు వావిలపల్లి అజయ్‌కుమార్‌తో కలిసి మాట్లాడుతూ అప్పలస్వామినాయుడు మాస్టారు గ్రామం కోసం గ్రంథాలయం ఏర్పాటుకు ఇంటిని వితరణగా ఇవ్వడం గొప్ప విషయమన్నారు. సొసైటీ సభ్యులు, గ్రామపెద్దలు శంబాన భాస్కరరావు, గౌరీశ్వరరావు, ఈర్ల సంజీవినాయుడు, శ్రీను, గోపిమాస్టారు, శాంతారాం పాల్గొన్నారు.

7వరకు సవరణకు గడువు

పాచిపెంట, న్యూస్‌టుడే: రైతులు ఈకేవైసీ నమోదులో తప్పులు ఉంటే ఈనెల ఏడులోపు రైతు సేవా కేంద్రాల్లో సవరించుకోవాలని ఏవో తిరుపతిరావు తెలిపారు. మండలంలో మాతుమూరు, పాంచాలి రైతులకు ఈ-పంట, ఈకెవైసీ నమోదు గురించి వివరించారు.

టెండరు ప్రక్రియ పరిశీలన

సీతానగరం, న్యూస్‌టుడే: ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణను అబ్కారీ శాఖ ఉన్నతాధికారి బి.జీవన్ కిశోర్ పరిశీలించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో టెండరు ప్రక్రియను పరిశీలించి, సిబ్బందికి సూచనలందించారు. ఆయన వెంట సీఐ పద్మావతి, ఎస్ఐ రాజశేఖర్ పట్నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలు సమృద్ధిగా పండాలి

భామిని, న్యూస్‌టుడే: పంటలు సమృద్ధిగా పండి రైతులు సుభిక్షిగా ఉండాలని వడ్డంగి గ్రామస్థులు కొండమ్మ తల్లిని కోరుకున్నారు. బుధవారం దేవతకు వరద పాశం పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవాయిద్యాల మధ్య యువకులు, చిన్నారులు, మహిళలు సందడిగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.



పొట్లం విప్పి చూడ.. కల్తీ ఉండును


రంగులు మారిన మాంసం

న్యూస్‌టుడే, నేరవార్తా విభాగం

● గజపతినగరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మార్కెట్లో బెల్లం కొనుగోలుకు వెళ్లారు. ఈలోపు ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు ఆ దుకాణంపై దాడులు చేసి, వివిధ పదార్థాల నమూనాలను సేకరించారు. ల్యాబ్‌కు పంపించగా.. బెల్లంలో సల్ఫర్, ఇతర రసాయనాలు ఉన్నట్లు గుర్తించారు.

● నగరానికి చెందిన ఓ ఉద్యోగి ప్రముఖ కంపెనీకి చెందిన నూనె కొన్నారు. రంగు మారడంతో అనుమానం వచ్చి ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వెళ్లి పరిశీలించగా.. నాసిరకం అని తేలింది. దీంతో విక్రయదారులపై కేసులు నమోదు చేశారు.

● నగర శివారు ప్రాంతంలోని రెస్టారెంటులో ఓ కుటుంబం భోజనం చేయడానికి వెళ్లింది. చికెన్- 65 రుచి మారింది. రంగు ఎక్కువగా ఉంది. వారి ఫిర్యాదుతో అధికారులు రంగంలోకి దిగగా.. ఆకర్షించేందుకు రసాయనాలు వాడినట్లు గుట్టురట్టు చేశారు.

బెల్లం మెరిసిపోతోందా.. టీపొడి మంచి వాసనొస్తోందా.. కందిపప్పు భళేగా ఉందా.. నెయ్యి నిగనిగలాడుతోందా.. చికెన్- 65 ఎర్రగా కనిపిస్తూ నోరూరిస్తోందా. . అయితే ఒక్క క్షణం ఆగండి.. రంగు.. వాసన చూసి కొనేయకండి.. అవి కల్తీవి కూడా కావొచ్చని చెబుతున్నారు ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు. ఇటీవల నిర్వహిస్తున్న దాడుల్లో పెద్దఎత్తున రసాయనాలతో కూడిన పదార్థాలను పట్టుకుంటున్నారు. ఈమేరకు విస్తుగొల్పే విషయాలను వెల్లడించారు.


నల్లగా మారిన నూనెను చూపిస్తున్న అధికారి

47 కేసులు..

జిల్లాలో ఆహార కల్తీ పెద్దఎత్తున సాగుతోంది. చిన్నపాటి దుకాణాల నుంచి పెద్దస్థాయి హోటళ్ల వరకు రసాయనాలతో కూడి పదార్థాలు దర్శనమిస్తున్నాయి. రోజూ ఎక్కడో ఓ చోట ఇలాంటి ఘటనలు బయటపడుతున్నాయి. గత ఆరు నెలల వ్యవధిలో ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు 47 కేసులు నమోదు చేశారు. అంటే ఆహార కల్తీ ఏమేర సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. తరచూ దాడులు లేకపోవడం, వినియోగదారులు గుర్తించలేకపోవడం, విక్రయదారులు విచ్చలవిడితనం.. తదితర కారణాలతో ఈ దుస్థితి నెలకొంది.

ఫిర్యాదు చేయండి..

మా బాధ్యతగా ప్రతి నెలా తనిఖీలు నిర్వహిస్తున్నాం. వ్యాపారులంతా నియమ, నిబంధనలు పాటించాలి. వినియోగదారులు అప్రమత్తంగా ఉంటేనే కల్తీపై కేసులు నమోదు చేయగలం. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి.
– ఈశ్వరి, ఆహార కల్తీ నియంత్రణ శాఖాధికారిణి

పొడి నుంచి పండ్ల వరకు..

నిత్యావసరాలుగా వినియోగించే వాటినే ఎక్కువగా కల్తీ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ విశ్రాంతి ఉద్యోగి మార్కెట్లో అరకిలో టీ-పొడి కొని, టీ పెట్టమని కుటుంబ సభ్యులను కోరారు. వారు వేడినీళ్లలో పొడి వేయగానే రంగుమారిపోయింది. వెంటనే దుకాణానికి వెళ్లగా.. తనకు సంబంధం లేదని యజమాని చెప్పారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు.. తనిఖీ చేయగా.. రసాయనాలు వాడినట్లు స్పష్టం చేశారు.

● బొబ్బిలి ప్రాంతానికి చెందిన ఓ మహిళ కొన్న యాపిల్ పండ్లు నెలరోజులైనా పాడవలేదు. అధికారులు పరిశీలించగా.. రసాయనాల పూత ఉన్నట్లు తేల్చారు.

పోలేరమ్మగా దేవికి పూజలు



పార్వతీపురం గ్రామీణం: పట్టణ సమీపంలోని వెంకంపేట కూడలిలో కనకదుర్గ అమ్మవారిని పోలేరమ్మగా అలంకరించి మహిళలు పూజలు చేశారు. బుధవారం ఉదయం వెంకంపేట, వైకేఎం కాలనీ, బాలాజీ నగర్ మహిళలు చెట్టుకు పసుపు రాసి బొట్లు పెట్టి దేవీ అర్చనలో పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి స్పందన

జియ్యమ్మవలస: పెదమేరంగి జంక్షన్ వద్ద సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, తిరుమలసాయి పాఠశాల ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 143 మందిని పరీక్షించి 81 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వెంకటరమణ, నారాయణరావు, బి.చినతల్లి, శ్రీహర్షిణి, సమన్వయకర్త వెంకటరమణ ఉన్నారు.

చిట్టి చేతుల సహాయం

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితులకు స్థానిక సరస్వతీ విద్యానికేతన్ చిన్నారులు తాము సైతం అంటూ రూ.10 వేలు పోగుచేశారు. మొత్తాన్ని కరస్పాండెంట్ విమలాదేవి ఎమ్మెల్యే జగదీశ్వరికి అందించారు.

హైకోర్టు న్యాయమూర్తి పరామర్శ

పార్వతీపురం పురపాలక: ఇటీవల అనారోగ్యానికి గురైన తెదేపా నాయకుడు ఎం.కృష్ణమోహన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ పరామర్శించారు. బుధవారం ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. డాక్టర్ బదరీనారాయణ, వెంకటేష్, రాజా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్వర్ణోత్సవాల ఆహ్వాన సంఘం

పార్వతీపురం పట్టణం: నవంబరులో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాల ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా గంటేడ గౌరునాయుడు, కోఛైర్మన్ టి.రమేష్, కన్వీనర్ ఎస్.మురళీమోహనరావు, కోశాధికారిగా కె.మురళిని ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు తెలిపారు.

తిరుమల పవిత్రత కాపాడుకుందాం

పార్వతీపురం, పురపాలక: తిరుమల పవిత్రతను కాపాడుకోవడానికి, గత ప్రభుత్వ అపచారాలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త యాత్రకు పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర సంఘీభావం ప్రకటించారు. నగర సంకీర్తనలో పాల్గొని బెలగాంలోని గుడికి వెళ్లి పూజలు చేశారు.

ఘన నివాళులు

సీతంపేట: సీతంపేట మండలం నౌగడలో ఇటీవల మృతి చెందిన అక్షరబ్రహ్మ గురువు సవర వెంకటరావు సంతాప సభ జరిపారు. ఒడిశా, ఆంధ్రాకు చెందిన అక్షర బ్రహ్మ గురువులు రాంప్రసాద్ గొమంగో, డిగాస్మీ గొమాంగో, ఎస్.ఆనందరావు, కామేశ్వరరావు, తిరుపతి, తల్లైబు, గంగారావు, కరువయ్య, బోగేష్ పాల్గొన్నారు.

కేసు నమోదు

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలోని నడుకూరుకు చెందిన డి.వసంతకుమార్ అదృశ్యమైనట్లు సోదరుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. సెప్టెంబరు 15న కుటుంబ సభ్యులతో చెప్పి బయటకు వెళ్లాడని, ఇంతవరకు తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు.

విదేశాల్లోనూ గాంధీమార్గం అనుసరణీయం


గాంధీ విగ్రహం వద్ద మంత్రి సంధ్యారాణి, నాయకులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విదేశీ రహదారులు, వీధులకు గాంధీమార్గం అని పేర్లు పెడుతున్నారని, దీనికి గల కారణం జాతిపిత గొప్పతనమని మంత్రి సంధ్యారాణి అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, ఆమె పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహిళలు అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగిన రోజే నిజమైన స్వాతంత్ర్యమని మహాత్ముడు అన్నారన్నారు. తెదేపా పట్టణాధ్యక్షుడు నిమ్మాది చిట్టి, గ్రామీణ అధ్యక్షుడు పరమేశు, శ్యామ్, శ్రీను, భాస్కరరావు పాల్గొన్నారు. నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్ పనులు పరిశీలించారు.

అమృతాహారంతో ఆరోగ్యం పదిలం


పుష్పగుచ్ఛం అందుకుంటున్న డాక్టర్ రామ్మోహనరావు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: మంచి అలవాట్లు, వ్యాయామంతో పాటు సహజంగా పండే పంటలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని కర్షక మహర్షి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు సూచించారు. బుధవారం కుటుంబ సభ్యులు, పట్టణ పెద్దలు, ఆసుపత్రి సిబ్బందితో కలసి పుట్టిన రోజును జరుపుకొన్నారు. రక్తదాన శిబిరంలో 36 యూనిట్లు సేకరించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో కేకును కోశారు.

ఆరు వాహనాలు.. 38 మూగజీవాలు



కొమరాడ, న్యూస్‌టుడే: ఒడిశా నుంచి ఆంధ్రాలో వివిధ ప్రాంతాలకు మూగజీవాలతో తరలివెళుతున్న వాహనాలను బుధవారం కొమరాడ పోలీసులు పట్టుకున్నారు. కొమరాడ పోలీసు ఠాణా వద్ద వాహనాలను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. ఎస్ఐ నీలకంఠం చెప్పిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి పార్వతీపురం, అడ్డాపుశిలకు ఆరు బొలెరో వాహనాల్లో 38 పశువులను తరలిస్తున్నారనే సమాచారంతో నిఘా పెట్టామన్నారు. వాహనాలను అదుపులోకి తీసుకుని, మూగజీవాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బొలెరో చోదకులపై కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	124	218	228

నేల రాలిన విద్యాకుసుమం


అవంతి (పాతచిత్రం)

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని తీవ్ర జ్వరం, రక్తహీనతతో మంగళవారం రాత్రి మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. గుమ్మలక్ష్మీపురం మండలం కె.శివడకు చెందిన నిమ్మల బాబురావు, మల్లేశ్వరిల కుమార్తె అవంతి (13) పి.ఆమిటి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆగస్టు 29న కాలు దగ్గర వాపు రావడంతో వసతిగృహం నుంచి ఇంటికి తీసుకెళ్లారు. జ్వరం రాగా పరీక్షలు చేయిస్తే ప్లేట్‌లెట్స్ తగ్గాయని చెప్పడంతో 30న పార్వతీపురం, మెరుగైన వైద్యం కోసం విజయనగరం తీసుకెళ్లారు. ఆరోగ్యం కుదుటపడడంతో సెప్టెంబరు 13న పాఠశాలకు తీసుకెళ్లగా.. అక్కడ ఉండనని మారాం చేయడంతో తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. 22న మళ్లీ జ్వరం రావడంతో పరీక్షలు చేయించగా రక్తహీనత అని తెలిసి.. పార్వతీపురం తీసుకెళ్లి 30న రక్తం ఎక్కించినా ప్రయోజనం లేకపోయింది. కళ్లముందే కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఏటీడబ్ల్యూవో సురేష్, పాఠశాల సిబ్బంది గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆటో బోల్తాపడి ఒకరికి గాయాలు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: మూగజీవి అడ్డురావడంతో ఆటో బోల్తాపడిన ఘటన బుధవారం సాయంత్రం పాలకొండ పట్టణం పరిధిలోని కార్గిల్ కూడలి వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సి.ఆంజనేయులకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడిని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. శ్రీకాకుళం జిలా నుంచి ఒకే కుటుంబానికి చెందిన పదిమంది అర్దలి గ్రామంలో మృతిచెందిన బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చోదకుడి మృతి

తొండంగి, న్యూస్‌టుడే: ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొట్టడంతో అందులోని చోదకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ బెండపూడి సమీపంలో ఆగింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న మరో లారీ బుధవారం తెల్లవారుజామున ఢీకొట్టింది. దీంతో వాహనం నడుపుతున్న పార్వతీపురం మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన బి.వెంకటరమణ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి తుని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

4న కలెక్టరేట్ వద్ద ధర్నా


దీక్ష శిబిరంలో కార్మికులు, సంఘనాయకులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానంపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండు చేస్తూ ఈనెల 4న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సిటు జిల్లా కార్యదర్శి మన్మథరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడుతూ నాగావళి నది రీచ్ ఉండగా.. వంశధార నుంచి ఇసుక తీసుకురావాలంటే సాధ్యపడే పనికాదన్నారు. సిటు నాయకులు వెంకటరమణ, గండి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సత్యాగ్రహ దీక్ష



పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షలు జరిగాయి. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గాంధీ విగ్రహం వద్ద దీక్షలు చేపట్టారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ పురపాలక ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. 17న డీఈవో, 24న డీఎస్ఈ కార్యాలయాల వద్ద ధర్నా చేపడతామని జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ తెలిపారు.

అగ్నివీర్‌కు నలుగురి ఎంపిక


ఎంపికైన వారితో శిక్షకుడు (మధ్యలో)

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలం నుంచి నలుగురు యువకులకు అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ నెలాఖరులోగా వారికి కేటాయించిన శిక్షణ సంస్థలకు వెళ్లనున్నట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు. మిర్తివలస గ్రామానికి చెందిన రాంబాబు మధ్యప్రదేశ్, తోటవలసలోని ఎం.వెంటటేష్, జగన్నాధరావు హైదరాబాద్, కొత్తవలసలోని సి.దుర్గాప్రసాద్‌రావు మధ్యప్రదేశ్, పాచిపెంట గ్రామంలోని నల్లి జగదీష్ బెంగళూరుకు వెళ్లనున్నారు. కోచ్ ఎన్.శేఖర్, యువకుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

మహాత్ముని కలలు సాకారం చేద్దాం


గ్రీన్ అంబాసిడర్లతో కలెక్టర్ ఇతర అధికారులు


గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

న్యూస్‌టుడే, బృందం: మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి వంటి మహనీయులు చూపించిన దారిలో ప్రతి ఒక్కరూ నడచి, వారు స్వప్నించిన దేశాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం గాంధీ, శాస్త్రి జయంతిని కలెక్టరేట్‌లో నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ చెప్పిన మాటలను మననం చేసుకుంటూ పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇందులో భాగస్వాములై, ఉత్తమ సేవలు అందించిన హరిత రాయబారులను జిల్లా పంచాయతీరాజ్ శాఖ సత్కరించింది.

● ప్రస్తుత సమాజంలో గాంధీ మార్గమే అనుసరణీయమని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు ఖైదీలకు సూచించారు. సబ్‌జైలులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సత్ప్రవర్తన విషయమై ఖైదీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈయన వెంట న్యాయవాదులు జోగారావు, ఎస్.ఉమామహేశ్వరరావు, బి.ఎన్.బి.రావు, జైలు అధికారులు ఉన్నారు. ● ప్రధాన రహదారిలోని గాంధీ సత్రంలో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే విజయచంద్ర నివాళులర్పించారు. ● మహాత్ముని ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు.


నివాళులర్పిస్తున్న న్యాయమూర్తి ఎస్.దామోదరరావు


సీతానగరంలో..

నవంబరు 10 వరకు గ్రామసభలు

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం పనుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించి నవంబరు 10 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీవో సత్యనారాయణ తెలిపారు. పాచిపెంటలో బుధవారం సర్పంచి సంతోష్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి.. సాగునీటి కాలువలు, రహదారులు, భూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు.

రహదారికి అడ్డంగా కూలిన వృక్షం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలం సారిక పంచాయతీ కేంద్రం సమీపంలోని బంగారమ్మ గుడి వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. బుధవారం సాయంత్రం వీచిన గాలులకు చెట్టు రహదారికి అడ్డంగా పడిపోయింది. దీంతో బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దండిగాం నుంచి సారిక, నేరేళ్లవలస, దొర్లతాడివలస, మూలతాడివలస, గంజాయిభద్ర పంచాయతీలోని పలు గ్రామాలు, ఒడిశా పర్యాటక కేంద్రం దేవుడుబ్బకి కూడా ఈ మార్గంలోనే వెళ్తారు.



నకిలీ విత్తనాల విక్రయాలపై కేసులు


పరిశీలిస్తున్న నాయకులు

మక్కువ, న్యూస్‌టుడే: మండలంలోని నంద గిరిజన రైతులకు నాసిరకం మొక్కజొన్న విత్తనాలు విక్రయించిన డీలర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.గంగానాయుడు, ఆదివాసీ మండల కార్యదర్శి టి.ప్రభాకర్ అన్నారు. బుధవారం గ్రామంలోని మొక్కజొన్న పంటను పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. డీలర్లు విత్తనాలు, ఎరువులు విక్రయించినప్పుడు తెల్లకాగితాలపై బిల్లులు రాస్తున్నారని ఆరోపించారు.

ఉత్తమ కార్యదర్శులకు ప్రశంసలు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట, కుసిమి పంచాయతీ కార్యదర్శులు బి.సుదర్శనరావు, దూసి రాజశేఖర్‌లను కలెక్టరు శ్యామ్ ప్రసాద్, ఇతర అధికారులు ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో బాగా పనిచేసి విధులు నిర్వర్తించారు. ఉత్తమ క్లాప్ మిత్రులుగా ఎన్.రాజేంద్ర, ఎ.సుబ్బారావులకు బహుమతులు అందజేశారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న సీతంపేట పంచాయతీ కార్యదర్శి సుదర్శనరావు

తెదేపా కార్యకర్తలకు న్యాయం చేయండి


సమావేశంలో చర్చిస్తున్న తెదేపా నాయకులు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో ఇబ్బందులు ఎదుర్కొన్న తెదేపా నాయకులు, కార్యకర్తలను గుర్తించాలని నియోజకవర్గ బాధ్యులు పడాల భూదేవిని అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు పల్లా కొండలరావు అన్నారు. బుధవారం అన్న క్యాంటీన్ సమీపంలో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎన్నికల్లో గెలుపునకు శ్రమించిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్టీ నాయకుల్లో విభేదాలు మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమన్వయం చేసి పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో తెదేపా పట్టణాధ్యక్షుడు గంటా సంతోష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి తీవ్ర అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈశ్వర్

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పాఠశాల నుంచి ఇంటికి వస్తూ ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారిపడటంతో విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన గుమ్మలక్ష్మీపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. మండలంలోని అడ్డంగి గూడకు చెందిన ఈశ్వర్ లక్ష్మీపురంలో ఏడోతరగతి చదువుతున్నాడు. బడి నుంచి ఇంటికి వస్తుండగా ఆటో నుంచి మంగళవారం జారిపడిపోయాడు. తలకు గాయం కావడంతో ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడి నుంచి జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించడంతో కుటుంబీకులు తీసుకెళ్లారు.